

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఇలా పూర్తయింది

**ఆ దురదృష్టకరమైన రోజు తను** వనిత ఇంటికి వెళ్ళకుండా ఉండాల్సిందని ఆ తర్వాత నీరద కొన్ని వేలసార్లు అనుకుంది. 'ఈ కష్టాలు తనకి రాసిపెట్టి ఉంటే ఎందుకు వెళ్ళదూ? అమ్మ వాళ్ళు తిరుపతి వెళ్ళినట్లు' అని కూడా అనుకుంది.

"తన ఇరవైమూడో బర్త్‌డే గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నానని, రాకపోతే జన్మలో పలకనని బెదిరించి మరీ వనిత ఆహ్వానించింది.

"అదేం మైల్ స్టోన్ బర్త్‌డే కాదుగా? నీ ట్వంటీ ఫిఫ్త్ బర్త్‌డేకి తప్పకుండా వస్తాను" నీరద అయిష్టంగా చెప్పింది.

"అప్పుడు ఎవరం ఎక్కడుంటామో? ఏమో వెగాస్‌లో చేసుకుంటానేమో. ఈ సమ్మర్‌లో పెళ్ళంటోంది అమ్మ" వనిత కించిత్ గర్వంగా చెప్పింది.

ఇక తప్పక వెళ్ళింది. వనిత యువరాణిలా రెడీ అయి వాళ్ళమ్మ దగ్గర గారాలు పోతూ వచ్చినవాళ్ళని సరిగ్గా పట్టించుకోనేలేదు. కొద్దిసేపటికి ఆమెకి కాబోయే భర్త, ప్రస్తుతం బావ రాగానే కొద్దిసేపు అలక నటించి, తర్వాత అతనితో గోముగా మాట్లాడి పరిచయం చేయడానికి మిత్రుల దగ్గరకి వచ్చింది.

ఆ హడావిడిలో కూడా తననెవరో చూస్తున్నట్లుగా అనిపించి నీరద అటువైపు చూసింది. అతనికి సుమారు ముప్పై ఏళ్ళుంటాయి. జుట్టుని ముందువైపు ఎగదువ్వుకుని వెనక రబ్బర్ బేండ్ పెట్టాడు. 'తనకన్నా పొడవైన జుట్టు' అనుకుంది.

ఎర్రటి నిలువు బొట్టు అతని చూపులు ఆమెని తినేసేట్లు చూస్తున్నాయి. ఎర్రటి పళ్ళు. ఈ రోజుల్లోని యువకుల్లో అలాంటి గారపట్టిన పళ్ళ వాళ్ళని ఎవరినీ చూడలేదు నీరద. ఆమె పరిధి చాలా చిన్నది. ఇల్లు, కాలేజ్ అక్కడ తారసపడిన వాళ్ళే తెలుసు. ప్రాణ మిత్రులు కూడా ఎవరూ లేరు.

ఆ చూపులు ఇబ్బందిగా అనిపించి వనిత వెంట ఆమె గదిలోకి వెళ్ళింది. తోటి స్నేహితురాళ్ళు గలగల మాట్లాడుతున్నారు. అందులో వనిత అదృష్టాన్ని, బావ అందాన్ని పొగిడే కబుర్లే ఉన్నాయి. కొద్దిసేపటికి ఆ పొడుగాటి జుట్టు అబ్బాయి కూడా ఆ గదిలోకి వచ్చాడు.

"నీతా కేక్ కట్ చేయవా? నీ ఫ్రెండ్స్‌కి ఆకలైనట్లుంది. గోళ్ళు తింటున్నారు" వెకిలిగా నవ్వాడు.

నీరద చటుక్కున తలవంచుకుని వెనక్కి వెళ్ళి నిలబడింది.

"వస్తున్నాం బావా. నువ్వెళ్ళు" వనిత చెప్పింది.

అతను అయిష్టంగా బయటకి వెళ్ళిపోయాడు.

"ఎంతమంది బావలే బాబూ నీకు?" ఓ ఫ్రెండ్ నవ్వింది.

"మా పెద్దత్త కొడుకు. ఆస్తిపాస్తులున్నాయి కానీ, చదువులేదు. ఏదో పొలిటికల్ పార్టీలో తిరుగుతూంటాడు. నాన్నకి ఇష్టంలేదు. మా పెద్దత్త ఊరుకోదని పిలిచా" వనిత గొంతు తగ్గించి చెప్పింది.

ఐదు నిమిషాల తర్వాత అతను మళ్ళీ అదే వెకిలి నవ్వు. వచ్చి అడిగాడు.

"నీతా! నీ ఫ్రెండ్స్‌ని నాకు పరిచయం చేయవా?"

"ఇంతమందిని పరిచయం చేసినా నీకు గుర్తుండరు కానీ నిన్ను పరిచయం చేస్తా. ఫ్రెండ్స్ ఇతను మా పెద్ద బావ. సంజయ్" వనిత పరిచయం చేసింది.

"హలో" నలుగురైదుగురు అమ్మాయిలు మర్యాద కోసం విష్ చేసారు.

"హలో" సంజయ్ మరోసారి నవ్వాడు.

మర్నాడు సాయంత్రం నీరద లేప్‌టాప్ ఆన్ చేసి, ఉద్యోగాలు ఏవైనా ఉన్నాయేమోనని చూస్తూండగా కాలింగ్ బెల్ మోగింది.

తనింటికి ఆ సమయంలో వచ్చేవాళ్ళు ఎవరూ లేరు కాబట్టి కొంచెం ఆశ్చర్యపోతూనే నీరద తలుపు తీసింది. ఎదురుగా సంజయ్.

చటుక్కున ఓ అడుగు వెనక్కి వేసింది. అతను తనదైన వెకిలి నవ్వుతో ఆమెని రాసుకుంటూ లోపలకి వచ్చాడు.

"మీరు.. ఎందుకు? మా ఇల్లు?" నీరద తడబాటుగా అడిగింది.

అతను సంకోచం లేకుండా సోఫాలో కూర్చుని టీపాయ్ మీద కాళ్ళు పెట్టి నవ్వుతూ చెప్పాడు.

"నువ్వు నాకు నచ్చావు. నువ్వెవరు, ఎక్కడుంటావు, ఏం చేస్తున్నారు లాంటివన్నీ చిటికెలో కనుక్కోగలను." చిటికె వేసాడు.

నీరద మొహం కోపంతో ఎర్రబడింది.

"ఇలా ఇతరుల ఇళ్ళలోకి రావడం మర్యాద కాదండి. దయచేసి వెళ్ళండి" గట్టిగా చెప్పింది.

"వెళ్ళకపోతే ఏం చేస్తావ్? మీ అమ్మా బాబులకి చెప్తావా?" పైకి చెయ్యి చూపిస్తూ అడిగాడు.

"నువ్వు ఏక్ నిరంజన్. నీ అమ్మా, బాబు, తంబి అందరూ తిరుపతి వెళ్తూ ఏక్సిడెంట్‌లో డమా. చుట్టాలు పక్కాలు ఎవరూ నీకు తెలీదు. చచ్చినాళ్ళు రొమేంటీక్. లవ్ మేరేజ్. దాంతో అంతా వెలేసారు. వాళ్ళు చచ్చాక నువ్వు వెళ్దామన్నా వాళ్ళెవరో వాళ్ళ పేర్లు, ఎడ్రస్‌లు ఏంటో నీకు తెలీదు. ఇల్లు సొంతమయ్యేసరికి ఏకాకిలా బతుకుతున్నావ్. పర్లేదు. నేనొచ్చాగా. జంటగా బతుకుదాం"

నీరద ఆగ్రహంతో వణికిపోయింది.

"తక్షణం బయటకి నడు. ఇంకో నిమిషం ఉన్నావంటే పోలీసులకి ఫోన్ చేస్తాను" అరిచింది.

"చేస్కో అంతా మన దోస్తులే. మీ ఎం ఎల్ ఏ కూడా 'సంజయ ' అని నన్ను వదలడు. నీకింకో దారిలేదు. ఇప్పుడు మూఢమో ఏదో అంది అమ్మ. అది పోగానే పెళ్ళికి రెడీ అవు. నువ్వు నానించి తప్పించుకోలేవు. గుర్తుంచుకో. మంచిగా మాట విన్నావా? రాణి లాగా చూసుకుంటా"

సంజయ్ మరోసారి వెకిలిగా నవ్వి లేచి ఆమె దగ్గరకి వెళ్ళి బుగ్గమీద గట్టిగా చుంబించి బయటకి వెళ్ళిపోయాడు.

నీరద తక్షణం బాత్‌రూంలోకి పరిగెత్తి మొహాన్ని పావుగంటసేపు కడిగి బయటకి వచ్చి వనితకి ఫోన్ చేసింది.

"హలో నీరూ నిన్న రాత్రి ఊటీ వచ్చా. ఏంటి కాల్ చేసావు?" వనిత అడిగింది.

నీరదకి పట్టరాని దుఃఖం వచ్చింది. వెక్కిళ్ళ మధ్య జరిగింది ఆమెకి వివరించింది.

వనిత నిర్ఘాంతపోయింది.

"సారీ నే నీరూ సంజయ్ అసలు మంచివాడు కాదు. ఇద్దరు ముగ్గురు అమ్మాయిల్ని రేప్ చేసాడంటారు. ఒకమ్మాయి వాడిపేరు రాసి ఆత్మహత్య చేసుకుంది కూడా. పొలిటికల్ ఇన్ ఫ్లుయెన్స్‌తో బయటకి వచ్చాడు. జాగ్రత్తగా ఉండు ప్రామిస్. నీ పేరు, అడ్రస్, డీ టైల్స్ ఏవీ నేను వాడితో చెప్పలేదు. "వనిత నిజాయితీగా బాధపడింది.

"ఇదేమైనా సినిమా నా నచ్చిన వాళ్ళ మీద కర్చీఫ్ లేసి రిజర్వ్ చేసుకోడానికి. ఏమనుకుంటున్నాడు నన్ను?" నీరద ఉగ్రంగా అడిగింది.

"నువ్వు వాడి నేం చేసినా సరే, నా సపోర్ట్ నీకే. జాగ్రత్త. సంజూ మూర్ఖుడు. సెంటిమెంట్స్ లేనివాడు. కొంచెం మంచిగా మాట్లాడి వాడి బాధ వదిలించుకో" వనిత సలహా ఇచ్చింది.

"ఛీ! నువ్వేమంటున్నావో నా కర్థమైంది. నేనూ వాడిలా పశువులా బిహేవ్ చేయలేను. సరే నా సంగతి నేను చూసుకుంటాలే. నీ చుట్టమని నీకు చెప్పా అంతే" నీరద లైన్ కట్ చేసింది.

వనిత వాళ్ళ నాన్నకి చెప్తుందని, ఆయన సంజయ్‌ని మందలిస్తాడని నీరద ఆశించింది కాని వనిత ఆ ఊసే ఎత్తలేదు.

తల్లితండ్రులు పోయాక ఆ రోజు మళ్ళీ ఆమెకి వంటరిదాన్ననే భావన కలిగి రాత్రంతా ఏడుస్తూనే ఉంది.

పొద్దున్నే పాలపాకెట్ తీసుకోడానికి తలుపు తీసిన నీరద మెట్లమీద కూర్చుని పేపర్ చదువుతున్న సంజయ్‌ని చూసి భయపడింది. 'ఇతను వెంటాడడం మానడా?' అని నిస్సహాయంగా అనుకుంది.

"హలో డార్లింగ్. గుడ్ మాణింగ్" సంజయ్ విష్ చేసాడు. ఆమె లోపలికి వెళ్ళి తలుపు మూసింది. అరడజను సార్లకి పైగా కాలింగ్ బెల్ కొట్టి, తర్వాత తలుపు మీద బాదడం మొదలుపెట్టాడు. చుట్టు పక్కల ఫ్లాట్స్ తలుపులు తెరచుకున్నాయి. వాళ్ళు విసుగ్గా చూసి నీరదకి ఫోన్ చేసి చెప్పారు.

"ఎవడో మీ తలుపు పగలకొడుతున్నాడు. ఇంకా నిద్ర లేవలేదా? తలుపు తియ్. గోల భరించలేకపోతున్నాం."

నీరద అసహాయంగా తలుపు తీసింది. సంజయ్ లోపలకి వచ్చి తలుపు మూసి చాచి ఆమె చెంప మీద కొట్టాడు. నీరద తూలి సోఫాలో పడిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏమనుకుంటున్నావే? నా మొహాన తలుపు మూస్తావా? చంపేస్తా. గుడ్మార్నింగ్ చెపితే తిరిగి విష్ చేయాలని కూడా తెలీదా ఇంజనీరింగ్ చదివావు? ఇంకోసారి అమర్యాదగా ప్రవర్తిస్తే చంపి పాతేస్తాను" సంజయ్ కళ్ళు పెద్దవి చేసి అరిచాడు.

నీరద చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగింది.

"నువ్వెంత ఏడ్చినా సరే. వదిలేది లేదు. ఏం తక్కువ నాకు? నీ వెంట పడుతున్నాననేనా?"

నీరద చేతులు జోడించి చెప్పింది.

"నీ చెల్లెల్ని అనుకో. నేను నిన్ను పెళ్ళి చేసుకోలేను. నాకిష్టం లేదు. ఇష్టంలేని దాన్ని చేసుకుని నువ్వేం సుఖపడతావు? దయచేసి వెళ్ళిపో. ఇంకెప్పుడూ నా ఇంటికి రావద్దు."

సంజయ్ ఆమె జుట్టు పట్టుకుని వంచి వీపు మీద గుద్దుతూ అరిచాడు.

"ఎంత శుభవార్త తెచ్చానో తెలుసా నీకు? వచ్చేనెల పదో తారీకున ముహూర్తం పెట్టించా. వనిత పెళ్ళికన్నా ముందే మన పెళ్ళి. అది చెప్దామని వస్తే వేషాలేస్తున్నావా? తల్లి, చెల్లి సెంటిమెంట్లు మనకి లేవు. నాకన్ను పడ్డాక నిన్ను యమధర్మరాజు కూడా కాపాడలేడు గుర్తుంచుకో"

ఆమెని కిందపడేసి పెద్ద పెద్ద అంగలతో బయటకి వెళ్ళిపోయాడు.

నీరద మధ్యాహ్నం దాకా నేలమీద పడుకునే ఉంది. ఆమెకి ఏం చేయాలో అర్ధం కావడంలేదు. తనని కాపాడడానికి ఈ ప్రపంచంలో ఎవరూ లేరు. పోలీసులకి చెప్పినా వేస్ట్. సంజయ్ పేరెంట్స్‌కి చెప్పినా అతన్ని వాళ్ళు కంట్రోల్ చేయలేరు. ఇంట్లోంచి వెళ్ళిపోదామంటే తనకి మరో ఊరులేదు. ఎక్కడికి పోవాలి? అసలు వాడు తనింటికి కాపలా పెట్టాడేమో కూడా.

నెమ్మదిగా లేచి ఫోన్‌లో బేంక్ యాప్ ఓపెన్ చేసి చూసింది. పేరెంట్స్ సేవింగ్స్, తల్లితండ్రులు, తమ్ముడు ప్రమాదంలో మరణించినప్పుడు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, తల్లితండ్రుల ఇన్సూరెన్స్ మొత్తం ఈ నాలుగేళ్ళు పొదుపుగా వాడాక పన్నెండులక్షలు ఎఫ్‌డిలో ఉన్నాయి. సేవింగ్స్ అకౌంట్స్‌లో ఏభై ఆరువేలున్నాయి. కానీ వాటివల్ల తనకి ఇప్పుడు ఉపయోగం లేదు. బీరువాలో చూసింది. ఐదువేలున్నాయి. హేండ్ బేగ్‌లో మరొ మూడు వందలు దొరికాయి. నిజానికి ఈ ఐదువేలు ఖర్చయ్యేలోగా ఉద్యోగం వెతుక్కోవాలని అనుకుంది తను. డబ్బు తరిగిపోయే కొద్దీ దిగులుగా ఉంటోంది. ఇప్పుడు ఈ ప్రమాదం. సంజయ్ జుట్టుముడి, ఎర్రటిపళ్ళు తలుచుకోగానే ఆమె ఒళ్ళు జలదరించింది.

ఓపిక తెచ్చుకుని మొహం కడుక్కుని పౌడర్ రాసుకుంది. చెంపమీద తేలిన గుర్తులు లీలగా కనిపిస్తూనే ఉన్నాయి. అతను జుట్టు పట్టి లేపడంతో తలంతా నొప్పి. నెమ్మదిగా దువ్వుకుని దుస్తులు మార్చుకుని బయటకి వచ్చింది. తలుపు మూసి తాళం పెట్టి మెట్లమీద ఏడో అంతస్తుకి వెళ్ళింది. ఓ అపార్ట్‌మెంట్ తలుపు తట్టింది. నిమిషం తర్వాత తలుపు తెరుచుకుంది.

ఓ యువకుడు తలుపు తెరిచి ఆమెని చూసి సంభ్రమంగా చెప్పాడు.

"హలో నీరదా! సర్‌ప్రైజ్ రండి..రండి."

గత్యంతరం లేక నీరద అతని వెనకే ఇంట్లోకి నడిచింది. నీరదని ఇష్టపడ్డ ఆనంద్ ఆ విషయం ఆమెకి చెప్పే ధైర్యం చేయలేకపోయాడు కాని నీరద అది గ్రహించీ తెలియనట్లుగా అంటీ ముట్టనట్లుగా ఉంటోంది. అలాంటిది ఈ సాయంత్రం ఆమె తన ఫ్లాట్‌కి రావడం అతనికి సంతోషంగా అనిపించింది.

"ఆనంద్. నాకు కొంత డబ్బు కావాలి" మొహమాటంగా అడిగింది.

ఆనంద్ తబ్బిబ్బయ్యాడు.

"నీరదా! ఎంతకావాలి? రేపు బేంక్ నించి తెచ్చిస్తే ఓకేనా? నా దగ్గర ఇప్పుడు ఎక్కువలేవు కాని బేంక్‌లో..."

"ఇప్పుడు ఎంతుంటే అంత ఇవ్వు ఆనంద్. అర్జెంట్" కోరింది.

"ఒక్క నిమిషం. కూర్చో."

ఆనంద్ లోపలకి వెళ్ళి ఐదు నిమిషాల తర్వాత బయటకి వచ్చాడు.

"పదమూడు వేలున్నాయి. సరిపోతాయా?" అడిగాడు.

"ఎంతుంటే అంత. థాంక్స్ ఆనంద్" మనస్ఫూర్తిగా చెప్పింది.

అతనిచ్చిన డబ్బు పేంట్ జేబులో పెట్టుకుని, మరో జేబులోంచి చెక్‌బుక్ తీసి చెప్పింది.

"ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయలేను ఆనంద్. చెక్ ఇస్తాను. అదీ వారం తర్వాతి డేట్‌తో. పర్లేదా?'

"అసలు ఇవ్వకపోయినా పర్లేదు. ఎంత అవసరం లేకపోతే నువ్వు మా ఇంటికి వచ్చి మరీ అడుగుతావు?" ఆనంద్ ఆత్మీయంగా చెప్పాడు.

నీరద పదిరోజుల తర్వాతి డేట్‌తో అతని పేరు మీద చెక్ రాసిచ్చింది.

"చాలా థాంక్స్ ఆనంద్" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

బయటకి వచ్చి లిఫ్ట్ వాడకుండా మెట్లమీద దిగి ఇంట్లోకి వచ్చింది. ఆమె భయపడ్డట్లు బయట సంజయ్ లేడు.

బేక్‌పేక్‌లో లేప్‌టాప్, ఛార్జర్ పట్టినన్ని బట్టలు, చెక్‌బుక్ సర్దుకుంది. ఫోన్ స్విచాఫ్ చేసి బీరువాలో అమ్మ చీరల కింద పెట్టింది. డెబిట్ కార్డు, ఆధారకార్డులని బాత్‌రూం షెల్ఫ్‌లో టవల్స్ కింద పెట్టింది.

స్నానం చేసి తయారై బయటకి వచ్చి ఇంటికి తాళం వేసి రాత్రి పదకొండు గంటల వేళ మెట్లమీద కిందకి దిగి చివరి రెండు మెట్ల మీద ఆగింది. లిఫ్ట్ ముందు నుంచున్న ఒకడ్ని వాచ్‌మేన్ వెళ్ళమంటున్నాడు.

"పదకొండింటికల్లా గేట్ మూసి తాళం వేయకపోతే సెక్రటరీ సార్ తిడతారు. పో."

అతను ఓసారి తలగోక్కుని బయటకి నడిచాడు. అతని వెనకే వాచ్‌మేన్ గేటు మూసి తాళం పెట్టాడు. తర్వాత తన గదిలోకి వెళ్ళి బయటి లైట్ ఆర్పేశాడు.

నీరద మెట్లు దిగి సెల్లార్‌లోకి వెళ్ళి వెనక గోడమీంచి బయటకి చూసింది. వెనక బజార్‌లోకి ఎంట్రన్స్ ఉన్న ఇంటికి, ఈ ఫ్లాట్స్‌కి మధ్య చిన్న గోడ మాత్రమే సరిహద్దు. వాచ్‌మేన్ అనేకసార్లు ఆ గోడ ఎక్కి వెనక కాంపౌండ్‌లోంచి కరివేపాకు కోయడం నీరద చూసింది. ఆ ఇంట్లో లైట్లు వెలగడం లేదు. అందులో ఇద్దరు వృద్ధ దంపతులుంటారని నీరదకి తెలుసు.

లేప్‌టాప్ బేగ్ గోడమీద పెట్టి, రెండు చేతులతో గోడ అంచుని పట్టుకుని ఎగిరి దానిమీద కూర్చుంది. అటువైపు కొద్దిగా కిందకి ఉంది నేల. బేగ్‌ని భుజాలకి తగిలించుకుని నెమ్మదిగా దూకింది. అనేక వేలసార్లు బాల్కనీలోంచి ఆ ఇంటిని గమనించిన నీరదకి ఆ పెరట్లో ఏవి ఎక్కడున్నాయో స్పష్టంగా తెలుసు. లేచి చెట్ల చాటున నడుస్తూ ముందువైపుకి వచ్చింది. అదృష్టవశాత్తూ గేట్ గడియపెట్టి వుంది కాని తాళం లేదు. చప్పుడు కాకుండా గేట్ తెరచుకుని బయటకి వచ్చి మళ్ళీ మూసింది. వీధి లైట్ వెలగడం లేదు.  చకచకా నడుస్తూ సమీపంలోని హాస్పిటల్ దగ్గరకి వచ్చింది. అప్పుడే పేషెంట్‌ని దింపిన ఆటో అతను ఆమెని చూసి అడిగాడు.

"ఆటో?"

తలూపి చెప్పింది.

"బస్టాండ్"

"రెండు వందలు."

"ఎందుకు? మీటర్ లేదా?"

"చల్. నూట ఏభై ఇవ్వు. ఎక్కు" చెప్పాడు.

గత్యంతరంలేక ఎక్కి కూర్చుంది. వీడికి డబ్బాశ తప్ప ఇంకేం ఆశలు ఉండకూడదని దేవుడిని ప్రార్థించింది. అతను నిజాయితీగా ఆటోని బస్టాండ్‌లో ఆపాడు.

దిగి అతనికి నూటఏభై చెల్లిస్తూండగా డిపోలోంచి ఓ బస్ బయటకి వస్తూ కనిపించింది. చెయ్యెత్తింది. డ్రైవర్ ఆపాక లోపలకి ఎక్కింది. చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఒకదాంట్లో కూర్చుంది.

"ఎక్కడికి పోవాలా?" కండక్టర్ అడిగాడు.

"ఈ బస్ ఎక్కడికి పోతుంది?"

ఆమె వంక విచిత్రంగా చూసి చెప్పాడు.

"ఆదిలాబాద్"

"అక్కడికి ఓ టిక్కెట్ ఇవ్వండి."

టిక్కెట్ తీసుకుని లాప్‌టాప్ బేగ్ ఒళ్ళో పెట్టుకుని కిటికీలోంచి చీకట్లోకి చూడసాగింది. ఆమెకి అంతా అయోమయంగా ఉంది. పులినో, సింహాన్నో కాదు సాటిమనిషిని చూసి తను భయపడిపారిపోతోంది. ఎక్కడికి? ఎంతకాలం? ఎంతకాలమైనా సంజయ్ తనని వదిలి పెడతాడా? ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు... మళ్ళీ తనకంటూ ఓ కుటుంబాన్ని ఏర్పరచుకోవాలని కలలు కంది కాని ఆమెకి దుఃఖం పొంగుకు వచ్చింది కాని నిగ్రహించుకుంది. ప్రస్తుతం తప్పించుకున్నట్లే. భవిష్యత్తులో సమస్య వస్తే అప్పుడు చూసుకుందాం అనుకుంది.

తెల్లారు ఝామున నాలుగ్గంటలకి బస్ ఓ చోట ఆగింది. మెలకువగానే ఉన్న నీరద కండక్టర్‌ని అడిగింది.

"ఇది ఏ ఊరు?"

"ఊరు రోడ్డుమీద లేదు. నాలుగు కిలోమీటర్లు నడవాలి. అన్నారం. టీ తాగాలంటే ఇక్కడ తాగచ్చు. బాత్‌రూమ్స్ కూడా ఉన్నయ్" చెప్పాడు.

నీరద ఓ క్షణం ఆలోచించి బేగ్ భుజాన వేసుకుని లేచి చెప్పింది.

"నేనిక్కడ దిగిపోతాను. ఊళ్ళోకి వెళ్ళే బాట చూపించండి ప్లీజ్."

"ఇంత చీకట్లోనా?" కండక్టర్ ఆశ్చర్యపోయాడు.

"నక్సలైట్లుంటారా? లేక పులులు, తోడేళ్ళు?"

"అవేమీ కాదుకాని, కొత్తవాళ్ళు వంటరిగా వెళ్ళలేరని.. పైగా మీరు లేడీస్" నసిగాడు.

నీరదకి నవ్వొచ్చింది. అందుకే పారిపోతున్నా అందామనుకుంది కాని మౌనంగా బస్ దిగింది. కండక్టర్ కూడా దిగి చీకట్లో ఓ సన్నటి కాలిబాట చూపించి చెప్పాడు.

"అది పట్టుకుని వెళ్ళిపొండి. లేదా ఈ టీ స్టాల్‌లో తెల్లారేదాకా కూర్చుని వెలుగొచ్చాక వెళ్ళండి."

"చాలా థాంక్సండి. అలాగే" నీరద కృతజ్ఞతగా చెప్పింది.

పావుగంటలో బస్ బయలుదేరింది. అది వెళ్ళాక నీరద నెమ్మదిగా అన్నారం రోడ్‌లో నడవసాగింది. చంద్రుడు లేడు. కొన్ని నక్షత్రాలు మాత్రమే మిణుకుమిణుకు మంటున్నాయి. తొందరలేదు కాబట్టి భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ నెమ్మదిగా నడిచి ఐదున్నరకి ఊళ్ళోకి వచ్చింది. అన్ని ఇళ్ళు చీకట్లో నిద్రపోతున్నాయి. మనిషి అలికిడి లేదు. అలసటగా ఓ చెట్టు కిందున్న అరుగు మీద కూర్చుంది. ఏడింటికి జన సంచారం మొదలైంది. ఊరి మొదట్లో కూర్చుని వున్న ఆమెని చూసి అంతా ఆశ్చర్యపోయారు.

"వవలు?" ఓ పెద్దాయన అడిగాడు.

ఆ భాష అర్ధంకాకపోయినా 'ఎవరికోసం?'గా తర్జుమా చేసుకుని అడిగింది.

"మీ సర్పంచ్ గారింటికి తీసుకెళ్తారా?"

"రా" ఆయన ఊళ్ళోకి నడిచాడు.

అన్నీ పూరిళ్ళు. పెంకుటిళ్ళు. డాబాలు తక్కువకాని అక్కడక్కడ ఉన్నాయి. సర్పంచ్‌గారిది కూడా డాబానే. ఊరు కటిక దరిద్రంలో లేదు. అలాగని ధనవంతమైన ఊరు కూడా కాదు. మధ్యస్థంగా ఉంది.

సర్పంచ్‌కి నలభై ఐదు – ఏభై మధ్య ఉంటుంది వయసు. జీన్స్‌లోని ఈ ఆధునిక యువతిని చూసి గౌరవంగా అడిగాడు.

"గవర్నమెంట్ నించి వచ్చారా?"

"లేదండి. నేను స్టూడెంట్‌ని" నీరద ఆయనకి నమస్కరించి చెప్పింది.

"స్టూడెంట్స్‌కి మా అన్నారంలో పనేంటి?" ఆయన ఆశ్చర్యపోయాడు.

"లాస్టియర్‌లో ఉన్నానండి. మాకు ఆఖరి సెమిస్టర్ ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. ఆ పనిమీద వచ్చా" నమ్రతగా చెప్పింది.

తర్వాత. తన బేక్‌పాక్‌లోంచి కొన్ని సర్టిఫికెట్స్ తీసి చూపించింది.

"పనేంటి? చందాలా?" ఆయన అనుమానంగా అడిగాడు.

"ఛ! కాదండి. మీ ఊళ్ళో స్కూల్ ఉంది కదా? స్కూలయ్యాక పిల్లలకి ప్రత్యేకంగా సైన్స్, మేథ్స్ చెపితే వచ్చే పరీక్షల్లో వాళ్ళ మార్కుల్లో ఇంప్రూవ్‌మెంట్ ఉంటుందా లేదా తెలుసుకోవాలని అంటే మన స్కూల్స్ లో విద్యా విధానం ఎలా ఉందో చూడాలని కూడా " నోటికొచ్చిన కథ అల్లేసింది.

"ప్రైవేట్లు చెప్తావా?"

"ఫీజ్‌లేదండి. పూర్తిగా ఉచితం. నాకు ఉండడానికి ఓ చోటు చూపిస్తే చాలు. నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వక్కర్లేదు. జస్ట్ కాలేజ్ ప్రాజెక్ట్" గబగబ చెప్పింది.

ఆయన ఓ క్షణం ఆలోచించి చెప్పాడు.

"సరే. మాదే పాతిల్లు ఉంది. అందులో ఉండు. మాకు దీపం పథకంలో వచ్చిన రెండు గేస్ కనెక్షన్స్ ఉన్నాయి. ఒకటిస్తాను. స్కూల్ పిల్లల్ని నీ దగ్గరకి ట్యూషన్‌కి పంపమని ఊరోళ్ళతో చెప్తాను. ఈ పూటకి ఇక్కడే ఉండి, సాయంత్రానికి వెళ్ళు. ఈలోగా ఆ ఇల్లు బాగు చేస్తారు"

నీరదకి ఆనందంతో కన్నీళ్ళు వచ్చాయి. లోకంలో అంతా సంజయ్‌లాంటి దుర్మార్గులేకాదు మంచివాళ్ళు కూడా ఉన్నారు. కొంతకాలం ఇక్కడ తలదాచుకోగలిగితే తర్వాత సంగతి తర్వాత చూడొచ్చు.

సర్పంచ్ భార్య కొంచెం చదువున్న ఆవిడే. బాగానే ఆదరించింది. వాళ్ళింట్లో అన్ని ఆధునిక సదుపాయాలని చూసి ఆశ్చర్యపోయింది. భోజనం ఓ మోస్తరుగా ఉంది కాని పట్టించుకోలేదు.

మధ్యాహ్నం మూడు గంటలకి సర్పంచ్ పిలిచి చెప్పాడు.

"నువ్వు ఉత్త చేతులతో వచ్చావని ఇంట్లో కొంత ఉప్పు, కారం, బియ్యంలాంటి సరుకులు పెట్టించా. రేపు కొనుక్కో. ఇవాల్టికి ప్రైవేట్ వద్దులే. ఇల్లు సర్ధుకుని పడుకో"

వాళ్ళకి కృతజ్ఞతలు చెప్పి పాలేరు వెంట సర్పంచ్‌గారి పాతింటికి వెళ్ళింది. అదో చిన్న పెంకుటిల్లు. ముందు పంచ, వెనక పెరడు ఉన్నాయి. అదృష్టవశాత్తూ బాత్‌రూం ఇంట్లోనే ఉంది. బయటకి వెళ్ళక్కర్లేదు. కిచెన్‌లో ప్లాట్‌ఫాం ఉండి, దానిమీద పాత లక్ష్మీ డీలక్స్ గేస్ స్టవ్, సిలిండర్‌కి కనెక్ట్ చేసి ఉంది. అల్మైరాలు బానే ఉన్నాయి.

ఆ ఇంటిని చూస్తే నీరదకి నవ్వొచ్చింది. ఈ ఇంట్లో ఉండేవాడు సర్పంచ్ అవగానే అంత అధునాతన ఇల్లు కట్టించుకున్నాడు. ఐదువేల లోపు జనాభా ఉన్న ఊళ్ళోనే అధికారం ఇంత సంపాదిస్తే మరి యం.ఎల్.ఏ, యం.పి లెవల్లో ఎంత సంపాదిస్తారో అనుకుంది. వారి వందిమాగధులు కూడా అదే రేంజ్‌లో కాకపోయినా బానే ఉంటారు. సంజయ్‌లాఅనుకుంది.

ఇల్లు శుభ్రంగా ఉంది. పాలేరు ఒక నవ్వారు మంచం, దిండు, రెండు దుప్పట్లు తెచ్చి చెప్పాడు.

"వండుకోకపోతే, రాత్రికి భోజనానికి అక్కడికే రమ్మన్నారు అమ్మగారు."

"లేదు. వండుకుంటా. రేపోసారి వచ్చి కలుస్తానని చెప్పు" చెప్పి తలుపు మూసి మంచం మీద వాలిపోయింది.

మర్నాడు ఉదయం ఏడున్నరకి తలుపు చప్పుడుకి మెలకువ వచ్చింది. లేచి వేళ్ళతో జుట్టు వెనక్కి దువ్వుకుని తలుపు తీసింది.

సర్పంచ్ గారి పాలేరు పాల చెంబుతో నిలబడి ఉన్నాడు.

"మీరున్నన్ని రోజులు పాలు, పెరుగు అమ్మగారే పంపిస్తామన్నారు" చెప్పాడు.

మొహం కడుక్కుని వంట గదిలోకి వెళ్ళి అలమరల తలుపులు తెరిచింది. ఒకదాంట్లో ఐదారు అన్ని సైజుల్లోని పాత్రలు, మూతలు, గరిటెలు, చంచాలు ఉన్నాయి. మరో దాంటో చిన్న సీసాల్లో కాఫీపొడి, పంచదార, టీపొడి, కందిపప్పు, ఎండు మిరపకాయలు లాంటి వంట దినుసులు ఉన్నాయి. చిన్న బియ్యం మూట. ఓ బుట్టలో కూరగాయలు.

ఆమె కళ్ళు సజలమయ్యాయి. 'ఏ జన్మ రుణమో!' అనుకుంది.

పాలు కాచి కాఫీ తాగి తలుపు తీసుకుని బయటకి వచ్చింది. చుట్టుపక్కల ఇల్లాళ్ళు ఆరుబయట కట్టెల పొయ్యి మీద వంట పని చేసుకుంటూ, ఆమె వంక ఆసక్తిగా చూసారు. నీరద అందరినీ చిరునవ్వుతో చూసి చెప్పింది.

"నా పేరు నీరద. మీ పిల్లలకి పాఠాలు చెప్పడానికి వచ్చాను. మీ పిల్లల్ని సాయంత్రాలు నా దగ్గరకి పంపించండి. నేను చదివిస్తాను. నాకు మీరేం ఫీజ్ ఇవ్వక్కర్లేదు."

కొంతమంది తలాడించారు.

నీరద లోపలకి వచ్చి లేప్‌టాప్ ఆన్ చేసింది. ఇంటర్నెట్ లేదు కాబట్టి అందులో డౌన్‌లోడ్ చేసుకున్న జాన్‌గ్రీషం నవలని చదవడం ఆరంభించింది. పదకొండింటికి లేచి వెళ్ళి అన్నం, వంకాయ కూర వండి స్నానం చేసి వచ్చింది.

భోజనం చేసి సర్పచ్‌గారింటికి వెళ్ళి కృతజ్ఞతలు చెప్పి వచ్చింది. వాళ్ళ పిల్లలిద్దరూ హైద్రాబాద్‌లో హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారని చెప్పాడాయన.

సాయంత్రం ఐదింటికి ఓ చిన్న తల తలుపు ఓరగా తీసి తొంగి చూసింది. వెనక మరికొన్ని తలలు. నవ్వి లేచి బయటకి వచ్చింది. పదిమంది దాకా పిల్లలు వచ్చారు. ఐదు నించి పన్నెండేళ్ళదాకా వుంటుంది వయసు.

అందర్నీ క్లాసులవారీగా కూర్చోపెట్టి వారికెంతవచ్చు పరీక్షించింది. ఆరో తరగతి పిల్లలకి కూడా ఆరో ఎక్కం రాదు. ఏబిసిడిలు వరసగా రాయలేరు. అఆలు మాత్రం బండి ర వరకు వచ్చు. మన విద్యావ్యవస్థని తలుచుకుంటే ఆమెకి దిగులుగా అనిపించింది. మధ్యాహ్న భోజన పథకం పుణ్యమా అని అంతా మానకుండా స్కూళ్ళకి వెళ్తున్నారు. టీచర్స్ సరిగ్గా చెప్పడం లేదో, వీళ్ళు చదవడం లేదో కాని బొత్తిగా విద్యాగంధం అంటలేదు.

టెన్స్ క్లాస్ చదివేప్పటినించే నీరద, తమ్ముడికి, తమ్ముడి ఫ్రెండ్స్‌కి ట్యూషన్ చెప్పేది. ఇంజనీరింగ్‌లో చేరాక ఇంటర్ విద్యార్థులకి మేథ్స్, ఫిజిక్స్ చెప్పేది. ఆ అనుభవంతో వారికి సులువుగా అర్థమయ్యేలా పాఠాలు బోధించింది.

రాత్రి ఎనిమిదింటికి తల్లితండ్రులు వచ్చి వాళ్ళని తీసుకెళ్ళారు. నీరదకి తృప్తిగా అనిపించింది. తను ఉన్నన్ని రోజులు వీళ్ళకి ఇలాగే చదువు చెప్పాలి అనుకుంది.

నీరద ఆ గ్రామం వచ్చి రెండు నెలలు దాటింది. విద్యార్థుల సంఖ్య ఇరవై దాటింది. నీరద తన డబ్బు చాలా పొదుపుగా ఖర్చు పెట్టుకుంటోంది. నిత్యావసరాలకి తప్ప దేనికీ ఖర్చుపెట్టడం లేదు.

ఆ ఊళ్ళో ఆమెని ఇబ్బంది పెట్టింది రెండే అంశాలు. ఫోన్, ఇంటర్నెట్ లేకపోవడంతో పగలంతా తోచక చదివిన పుస్తకాలే చదివేది. రెండోది ఆ గ్రామస్థుల మూఢ విశ్వాసాలు, బలులు. మొదటిసారి గొర్రెని బలిచ్చినప్పుడు ఆమె వణికిపోయింది. చూస్తూ చూస్తూ చీమని చంపలేం. అలాంటిది అంత తేలిగ్గా కోళ్ళని, గొర్రెలని, మేకలని ఎలా నరికేస్తున్నారో అనుకుంది. వాళ్ళకి విపరీతమైన అనుమానాలు, దిష్టి నమ్మకాలు. ఇవన్నీ ఆమెకి నచ్చకపోయినా బయటకి అనలేదు. తనేం సంస్కర్త కాదు. ఇవాళ ఉండి రేపు పోయేది. వీళ్ళకిప్పుడు నీతులు చెప్పినా వాళ్ళెవరూ వినరు అనుకుని మౌనంగా ఉండిపోయింది. గ్రామస్థులకి కూడా ఆమె మీద అభిమానం కలిగింది. పిల్లలకి శ్రద్ధగా పాఠాలు చెప్పడం, తన పనేదో తను చేసుకుని ఎవరిళ్ళకీ వెళ్ళక ఇంట్లోనే ఉంటూ క్లుప్తంగా బతకడం వాళ్ళకి నచ్చింది. 'ఈ కాలం అమ్మాయి కాదు' అనుకున్నారు.

ఆ రోజు ఉదయం ఆరుగంటలకే తలుపు చప్పుడైంది. పాలేరు పాలు తెచ్చాడనుకుంది. బద్ధకంగా లేచి కూర్చుంది. ఇంకా కను చీకటిగా ఉంది. తలుపు మీద చప్పుడు ఎక్కువైంది. ఎవరో ధనధనా కొడుతున్నారు. నిద్రమత్తులో కూడా ఆమె భయంతో బిగుసుకుపోయింది.

ఎవరు? సంజయ్?

తను ఇక్కడ ఉందని ఎలా తెలుసుకున్నాడు? ఇప్పుడేం చేయాలి? వాచ్‌లో టైం చూసింది. పాలేరు ఇంకా గంటకి కాని రాడు. ఊళ్ళో వాళ్ళు కూడా ఇంత పొద్దున్నే లేవరు. తనేం చేయాలి? తలుపు విరిగిపోయేలా ఉంది. తప్పక లేచి వెళ్ళి తలుపు తీసింది ఆమె అనుమానం నిజమే.

ఎదురుగా సంజయ్

ఆమెని చూడగానే ఈడ్చి చెంపమీద కొట్టాడు. పక్కకి తూలి దర్వాజా మీద పడింది.

"నన్ను తప్పించుకుని పోవాలనేనా? ఫోన్ వదిలేస్తే ఎక్కడుందీ తెలీదనుకున్నావా? సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌వి. సి.సి కెమెరాలు మర్చిపోయావు. హాస్పటల్ ముందు కెమెరా నీ ఆటో నంబర్ చూపించింది. ఆటో డ్రైవర్ అర్ధరాత్రి ఆటో ఎక్కిన వీర వనిత ఆదిలాబాద్ బస్ ఎక్కిందని గుర్తుంచుకున్నాడు. బస్ కండక్టర్ అన్నారంలో దిగిందని చెప్పాడు. ఖతం.

నువ్వెక్కడున్నావో తెలిసిపోయింది. సెంట్రల్‌లో ఏదో పనుండి ఢిల్లీ పోయొచ్చా. పంజరంలో పక్షివి. నువ్వెక్కడికి వెళ్తావ్?" నవ్వాడు.

నీరద రెండు చేతులు జోడించి చెప్పింది.

"నన్ను వదిలెయ్. వేరే మంచి అమ్మాయిని పెళ్ళి చేసుకో. ప్లీజ్. నువ్వు నాకిష్టం లేదు."

ఆమె చెంప మీద అదే చోట మరో దెబ్బ పడింది. పెదవుల సందుల్లోంచి రక్తం బయటకి కారసాగింది.

"చేసుకుంటా. నువ్వు బోర్ కొట్టినప్పుడు ఇంకోదాన్ని చేసుకుంటా. నువ్వు చెప్పాలా? పద. దరిద్రపు గొట్టూరు. ఊళ్ళోకి ఓ రోడ్ కూడా లేదు. కారు అక్కడే వదిలేసి నడిచొచ్చా. ఇంకా చిరాకు పెట్టకు. నడు" పెద్దగా గర్జించాడు.

ఈ అలికిడికి గ్రామస్థులు ఒక్కొక్కరే చేరుతున్నారు. సంజయ్ ఆమె జుట్టు పట్టుకుని లాగుతూ అరిచాడు "పద. వెధవ్వేషాలు వేస్తే నిన్ను బతకనివ్వను."

"ఎవరీయన?" కబురందుకుని వచ్చిన సర్పంచ్ అడిగాడు.

నీరద చుట్టూ చూసింది. గ్రామస్థులు ఆడ, మగ చుట్టు గుమిగూడి ఆసక్తిగా చూస్తున్నారు. సంజయ్ కళ్ళు అతని నుదుటి మీది తిలకం అంత ఎర్రగా ఉన్నాయి. తన జుట్టు అతని చేతిలో ఉంది.

ఆమె ఓ క్షణం ఊపిరి తీసుకుని, గడ్డం మీదకి కారే రక్తాన్ని తుడుచుకుంటూ చెప్పింది.

"ఎవరో తెలీదు. ఇతను చెప్పినట్లు వినకపోతే చేతబడి, అదే బాణామతి చేస్తానని బెదిరిస్తున్నాడు. మాంత్రికుడట."

ఆ మాట వినగానే గ్రామస్థుల్లోని ఆడవాళ్ళు చిన్నగా కేకపెట్టారు. మగాళ్ళు ఆవేశంగా అడుగు ముందుకేసారు.

సంజయ్ ఓ నిమిషం ఆలస్యంగా అది గ్రహించాడు. నీరద జుట్టు వదిలి, చెయ్యి పేంట్ జేబులో పెట్టేలోపలే గ్రామస్థులు అతన్ని చుట్టుముట్టారు.

నీరద వేగంగా బేగ్ అందుకుని బయటకి పరిగెత్తింది. వెనకనించి సంజయ్ అరుపులు వినిపిస్తున్నాయి. చీమని చంపినా చూడలేని నీరదకి ఆ అరుపులు శ్రావ్యంగా ఉన్నాయి.

ఆమె ఊరు దాటేదాకా పరిగెత్తి, ఆ తర్వాత వేగంగా నడిచింది. టీ బంక్‌కి కొద్ది దూరంలో సంజయ్ కారు కనిపించింది. దాన్ని లాక్ చేయకుండా నిర్లక్ష్యంగా అలాగే వదిలి వచ్చాడు.

నీరద ఆ కారెక్కి స్టార్ట్ చేసి వెనక్కి తిప్పింది. తల్లితండ్రులుండగా సరదాగా నేర్చుకున్న డ్రైవింగ్ ఇప్పుడు ఉపయోగపడింది.

మర్నాడు తన ఫ్లాట్‌లో కాఫీ తాగుతూ ఈనాడు చదువుతున్న నీరదకి లోపలి పేజీల్లో చిన్న కాలంలో ఆ వార్త కనిపించింది. 'బాణామతి మాంత్రికుడనే అనుమానంతో అన్నారం గ్రామస్థులు ఓ వ్యక్తిని చెట్టుకి కట్టేసి కాల్చి చంపేసారని ఆ వార్త. మృతుడు ఎవరో, ఎక్కడివాడో తెలీదని రాసారు.

నీరద ఆ చెట్టు మీద జాలిపడింది. 'పాపం నిప్పు సెగకి దానికెంత బాధ కలిగిందో' అనుకుంది.

సిసి కెమెరాలకి చిక్కకుండా తాను కీస్‌తో వదిలిన సంజయ్ కారుని ఎవరో ఎత్తుకుపోయుంటారు. దాన్ని రికవర్ చేయడానికి టైం పడుతుంది అనుకుంది.

సెల్ ఫోన్ ఛార్జ్ చేసి ఆన్ చేసాక ఆనంద్‌కి ఫోన్ చేసి అడిగింది.

"చెక్ కేష్ చేసుకోలేదేం?"

"నీ సంతకం ఉందని నీరదా" సిగ్గుగా చెప్పాడు.

నీరద కూడా నవ్వి చెప్పింది.

"సాయంత్రం వచ్చి కేష్ ఇచ్చేస్తాలే"

(ఒక అవకతవక కంగాళీ సినిమా చూశాక 'దీన్ని ఎలా తీశారా?' అని ఆశ్చర్యపోతే, 'అసలు అలాంటి కథ వ్రాయడం ఎంత కష్టమో తెలుసా? మంచి కథ వ్రాయడమే సులభం' అని ఓ ఫ్రెండ్ అన్నారు. అవకతవక కంగాళీ కథ వ్రాయగలనా లేనా అని నన్ను నేను పరీక్షించుకోడానికే ఈ కథ. ఎలా ఉందే మీరే చెప్పాలి..!)

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments